# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటం



చల్లూరులో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- ఎమ్మెల్యేగా గెలిచాక చల్లూరును మండలం చేస్తాం
- పథకాలను ప్రతి గడపకూ తీసుకువెళ్లాలి
- హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- చల్లూరులో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

వీణవంక, అక్టోబర్ 29: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, ప్రతి ఒక్కరినీ కంటికిరెప్పలా పార్టీ కాపాడుకుంటుందని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని చల్లూరు గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లూరు గ్రామానికి చెందిన పొన్నాల సదయ్య, బండి సమ్మయ్య, శ్రీకాంత్, చంద్రయ్య, బొంగోని క్రాంతికుమార్, గణేశ్, ఎల్లయ్య సహా 50 మంది బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల కోరిక మేరకు, పరిపాలనా సౌలభ్యం కోసం ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే చల్లూరును మండలంగా ఏర్పాటు చేస్తానని, గ్రామాన్ని దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు రూ. లక్ష వరకు పంట రుణమాఫీ వర్తించని వారికి వారం పది రోజుల్లో డబ్బులు జమ అవుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించాలని, సంక్షేమ పథకాలపై గ్రామాల్లో చర్చ జరుగాలని సూచించారు. తెలంగాణ వస్తే చీకటి అవుతుందన్న వారే నేడు ఇక్కడి వెలుగులు చూసి ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రవేశపెట్టారని చెప్పారు. ఎవరేమన్నా మూడోసారి కేసీఆరే సీఎం అని, బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసిన పార్టీకి ప్రజలు అండగా ఉండాలని, హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతి రెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచ్ పొదిల జ్యోతి-రమేశ్, ఎంపీటీసీ ఎలవేన సవిత-మల్లయ్య, ఉపసర్పంచ్ సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కుమార్, మాజీ సర్పంచ్ జక్కు నారాయణ, మాజీ ఎంపీటీసీలు తాండ్ర శంకర్, రమణారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాల్లో పాల్గొన్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రజలను చల్లంగా చూడాలంటూ పోచమ్మ తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి వేడుకున్నారు. మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించగా, కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడోసారి గెలిపిస్తారని, ముఖ్యంగా మహిళలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లాచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చొల్లేటి కిషన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



27వ వార్డులో కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు

## 27వ వార్డులో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



హనుమాన్‌గుడి ప్రాంతంలో ఓటు అడుగుతున్న మున్సిపల్ కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 29: కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, 27వ కౌన్సిలర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలోని 27వ వార్డులో కౌన్సిలర్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ, అందుబాటులో ఉండే కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్ మక్కపెల్లి కుమార్, 27వ వార్డు పార్టీ అధ్యక్షుడు మూశం మార్కండేయ, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఇసాక్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మూశం తిరుపతి, నాయకులు పంజాల శ్రీధర్‌గౌడ్, కెక్కర్ల సారయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



మొండయ్య కుటుంబానికి బియ్యం, నగదు అందజేస్తున్న హుజూరాబాద్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ప్రజాప్రతినిధులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 29: పట్టణానికి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు హుజూరాబాద్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.22వేల 200 నగదు, అలాగే 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. త్వరలోనే మరింత సాయం అందజేస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల గోవర్ధన్, చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ముక్క రమేశ్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎంఏ మథిన్, శ్రీనివాస్, రాజేశం, పీఈటీ రాజిరెడ్డి, వేల్పుల రత్నం, సాదుల రవీందర్, ఎంఏ సలీం, ఈశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వీరస్వామి, వేణు, రవి, రవీందర్, రాజేందర్, దేవానంద్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# పచ్చివడ్లకు మస్తు డిమాండ్

- సన్నాలకు క్వింటాల్ రూ. 2200 చొప్పున కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఆనందంలో అన్నదాతలు

హుజూరాబాద్, అక్టోబర్ 29: గతంలో ఎన్నడూ లేని విధంగా పచ్చి వడ్లకు విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.2200, దొడ్డు ధాన్యానికి రూ.1850 ధర పలుకుతున్నది. వడ్లు మంచిగా ఉంటే క్వింటాల్‌కు మరో రూ.20నుంచి 30వరకు అదనంగా చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. డివిజన్‌లో లక్షా 20వేల 650 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ఈ వానకాలంలో 74,336 ఎకరాల్లో వరి సాగైందని అధికారులు పేర్కొన్నారు. ఇందులో హుజూరాబాద్ మండలంలో అత్యధికంగా 23,857 ఎకరాలు, అత్యల్పంగా ఇల్లందకుంటలో 9,322 ఎకరాలు, వీణవంకలో 15,489 ఎకరాలు, సైదాపూర్‌లో 13,553, జమ్మికుంటలో 12,115 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో 35వేల ఎకరాల్లో బీపీటీ, జైశ్రీరాం, తెలంగాణ సోనా తదితర సన్న రకాలు పండించారు.

## ఆనందంలో రైతులు

పచ్చివడ్లు మీదిమీదనే అమ్ముడుపోతుండడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఆరబోసేందుకు స్థలాభావంతోపాటు కూలీల కొరతతో వడ్లు ఆరబోసే పరిస్థితి కనబడడం లేదు. ఈ సమయంలో పచ్చివడ్లకు గిరాకీ ఏర్పడడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతున్నది. అంతేకాకుండా రెండుమూడు రోజుల వాయిదాతో వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. నీళ్లు పుష్కలంగా ఉండడంతో చాలా చోట్ల ముందస్తుగా జూన్ రెండో మాసంలోనే వరి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు పచ్చి సన్న వడ్లకు రూ. 1850 ధర పలుకగా, దొడ్డు వడ్లకు రూ.1750 పెట్టి కొనుగోలు చేశారు.



పెద్దపాపయ్యపల్లిలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్న పచ్చి వడ్లు

## గ్రామాల్లోనే వ్యాపారులు

పచ్చి వడ్లకు విపరీతంగా డిమాండ్ ఏర్పడడంతో గ్రామాల్లో వ్యాపారులు తిష్ట వేశారు. ఏజెంట్లను నియమించుకుని పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్నారు. రూ.10 ఎక్కువైన మంచిదే... సన్నవడ్లను కొనడానికి వ్యాపారులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పచ్చివడ్లు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దాపురం, మండపేటకు, ఇక్కడ సూర్యాపేట, నల్గొండ, హైదరాబాద్‌కు ఎగుమతి అవుతున్నాయి. సన్నవడ్లకు డిమాండ్ వచ్చే అవకాశాలు ఉండడంతో మన దగ్గరి రైస్‌మిల్లర్లు కొందరు ఎండిన వడ్లు రూ.2450పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు ప్రస్తుతం రూ.2160 ఉన్న తరుణంలో పచ్చి వడ్లకు మంచి ధర పలుకుతుండడంతో రైతులు పచ్చివడ్లను అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు.

## స్వరార్చనకు మల్లారెడ్డిపల్లివాసి ఎంపిక



గోనెల సమ్మయ్య

వీణవంక, అక్టోబర్ 29: ఈ నెల 31న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే స్వరార్చనకు మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన కళాకారుడు గోన్నెల సమ్మయ్య ఎంపికయ్యారు. విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 45 మంది కళాకారులను ఎంపిక చేయగా, అందులో మల్లారెడ్డిపల్లికి చెందిన కళాకారుడు గోనెల సమ్మయ్యకు చోటు దక్కడంపై మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, స్వరార్చనకు తనను ఎంపిక చేసిన మాస్టారుజీకి ఈ సందర్భంగా సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. స్వరార్చనకు మండలంలోని కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కళాకారుడు సమ్మయ్య కోరారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి గరుడ సేవ



లింగన్నపేటలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

గంభీరావుపేట, అక్టోబర్ 29: మండలంలోని లింగన్నపేట వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధుల్లో మహిళలు మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్నారు.

## రాంపూర్ వాసికి అంతర్జాతీయ సమావేశానికి ఆహ్వానం



శ్రీరాములు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 29: అమెరికాలోని హవాయి రాష్ట్రంలో జనవరి మొదటి వారంలో జరుగబోయే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గోసికొండ శ్రీరాములు ఎంపికయ్యారు. శ్రీరాములు జడ్చర్లలో ఓ ప్రైవేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. తత్వశాస్త్రానికి సంబంధించి అంశంపై అమెరికాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని జపాన్‌కు చెందిన ఇంటర్ నేషనల్ అకాడమిక్ ఫోరం తనకు ఆహ్వానం పంపిందని శ్రీరాములు ఆదివారం తెలిపారు. అయితే అమెరికా వెళ్లడానికి రూ.3 లక్షలు ఖర్చవుతాయని, తనకు అంత స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా దాతలు చేయూతనందించాలని కోరారు. విరాళాలను 8106986902 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అతడి నేత్రాలు సజీవం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 29: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పాముల సతీశ్(37) ఐదు రోజుల క్రితం ప్రమాదవశాత్తు తన పొలం వద్ద ట్రాక్టర్ కింద పడడంతో తీవ్రగాయాలు కాగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ క్రమంలో సతీశ్ నేత్రాలను దానం చేసేందుకు అతడి భార్య సౌజన్య, తల్లిదండ్రులు మదనమ్మ, వెంకటనర్సయ్య ముందుకు వచ్చారు. ఈ మేరకు కరీంనగర్ ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన వైద్యులు నేత్రాలు సేకరించారు. సతీశ్ మృతి చెందినప్పటికీ అతడి నేత్రాలు మరొకరికి ఉపయోగపడాలని దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.